

నేడు పుట్టపర్తికి సుప్రీంకోర్టు మాజీ జడ్జి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఎన్‌వి. రమణ పుట్టపర్తికి ఆదివారం రానున్నారు. ఈ మేరకు కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదల అయింది. సుప్రీంకోర్డు మాజీన్యాయమూర్తి ఎన్.వి.రమణ తన కుటుంబంతో ఆదివారం సాయంత్రం 4:10 గంటలకు రోడ్డు మార్గాన బెంగళూరు నుంచి ప్రశాంతి నిలయానికి చేరుకోనున్నారు. ఈ మేరకు వారు బాబా మహాసమాధిని దర్శించుకుని ఆదివారం రాత్రి అక్కడే ప్రశాంతి నిలయంలోనే బస చేయనున్నారు. సోమవారం ఉదయం సత్యసాయిబాబా మహాసమాధిని దర్శించుకుంటారు. అనంతరం 11 గంటలకు పుట్టపర్తి నుంచి బయలుదేరి బెంగళూరుకు వెళతారు. ఈ మేరకు కలెక్టరేట్‌నుంచి శనివారం ఒక ప్రకటన వెలువడింది.

జెఎన్‌టియులో
స్నాతకోత్సవ సంబరం

- 71 మందికి బంగారు పతకాలు
- 86142 డిగ్రీ పట్టాలు ప్రదానం
- హాజరైన రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న ప్రొఫెసర్ కె.బాలవీరారెడ్డి



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న జెఎన్‌టియు విసి రంగజనార్ధన్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జెఎన్‌టియు 13వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. 2020-21, 2022-23 విద్యా సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. రెండు విద్యా సంవత్సరాలకు సంబంధించిన డిగ్రీలు ఒకేసారి కావడంతో పెద్దఎత్తున విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రావడంతో విశ్వవిద్యాలయ ఆవరణం కోలాహలంగా మారింది. ఎన్టీఆర్ ఆడిటోరియం హాలులో శనివారం ఉదయం స్నాతకోత్సవం ప్రారంభమై మధ్యాహ్నానికి ముగిసింది. ఈ కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ ఛాన్సలర్ హోదాలో హాజరవగా, ఢిల్లీ ఐఐటి మాజీ డైరెక్టరు ప్రొఫెసరు విఘ్నేశ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

'బాలవీరారెడ్డికి గౌరవ డాక్టరేట్

విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసరు కె.బాలవీరారెడ్డి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 71 మంది విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేశారు. 68963 మందికి బ్యాచ్‌లర్ డిగ్రీ ప్రదానం చేశారు. 16914 మందికి ప్రొస్టుగ్రాడ్యుయేషన్, 265 మందికి పిహెచ్‌డి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ విద్య అన్నది సమాచార సంగ్రహణకే కాదని అన్నారు. 21 శతాబ్దపు సవాళ్లను ఎదుర్కొనే ఆలోచన విధానముండాలని సూచించారు. 'గొడుగు వర్షాన్ని ఆపలేదు...కాని వర్షంలో నిలబడేందుకు ఉపయోగపడుతుంది. ఆత్మవిశ్వాసం కూడా అన్నింటిలోనూ విజయాన్ని అందివ్వకపోవచ్చుగాని, సవాళ్లను ఎదుర్కొనేమనో ధైర్యాన్నిస్తుంది.'అని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేసిన వ్యాఖ్యాలను అ సందర్భంగా ఉటంకించారు. విద్యార్థులు కూడా విజయాన్ని సాధించడం ఒక్కటే కాదు.సవాళ్లను ఎదుర్కొనే మనోధైర్యాన్ని కలిగి ఉండాలని చెప్పారు. ముఖ్య అతిథి సత్యనారాయణరాజు మాట్లాడుతూ భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ఇంజనీర్లు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందని చెప్పారు. విజ్ఞానమంటే కేవలం కంప్యూటరు విద్య మాత్రమే కాదని అన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, కెమికల్ అన్ని విభాగాలు సమానాభివృద్ధి జరగాల్సి ఉందని చెప్పారు. స్నాతకోత్సవం అనంతరం విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన పరిపాలనా భవనాన్ని గవర్నర్ మీట నొక్కి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి, వైస్ ఛాన్సలర్ రంగ జనార్ధన్, రెక్టార్ ఆచార్య ఎం.విజయ్‌కుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, వర్శిటీ డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దాసరి శాంతికి ఎనిమిది బంగారు పతకాలు

అనంతపురం జెఎన్‌టియులో 2022-23 సివిల్ టాపర్‌గా దాసరి శాంతి నిలిచింది. ఈమె యూనివర్శిటీకి ఇచ్చిన బంగారు పతకంతోపాటు ఎండోమెంట్ పతకాలు కలిపి మొత్తం ఎనిమిది బంగారు పతకాలు సాధించింది. సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి చెందిన శాంతి తండ్రి ఎలక్ట్రికల్ పనిచేసి జీవనం సాగిస్తుంటాడు. ఐఇఎస్ చేయాలన్నది తన కల అని శాంతి ఈసందర్భంగా తెలిపింది.

బోగినేని మేఘనకు నాలుగు బంగారు పతకాలు

అనంతపురానికి చెందిన బోగినేని మేఘన నాలుగు బంగారు పతకాలు సాధించింది. అనంతపురం జెఎన్‌టియులోని బిటెక్‌లో సివిల్ టాపర్‌గా వచ్చిన మేఘనకు నాలుగు బంగారు పతకాలు వచ్చాయి. కళాశాల టాపర్ అయినందుకు యూనివర్శిటీ గోల్డ్ మెడల్ రాగా, తక్కిన మూడు ఎండోమెంట్ గోల్డ్‌మెడల్స్ దక్కాయి. 2021-22 సంవత్సరంలో టాపర్‌గా వచ్చినందుకు ఈ పతకాలు లభించాయి. ప్రస్తుతం ఎజి అడిట్‌లో పనిచేస్తున్నట్టు మేఘన తెలిపింది. సివిల్ సర్వెంట్‌గా పనిచేయాలన్నదే తన లక్ష్యమని మేఘన ఈ సందర్భంగా తెలిపింది.

పేదరికాన్ని అధిగమించిన సంగీతకు బంగారు పతకం

తండ్రి హోటల్‌లో చిరుద్యోగి, అత్యంత పేదరికం. అయినా చదువుపైనున్న శ్రద్ధతో సంగీత అనే విద్యార్థిని ఇసిఇలో బంగారు పతకాన్ని అందుకుంది. బలపనూరులో అవ్వ ఇంటి వద్ద ఉండి డే స్కాలర్‌గా వెలుతూ ఈ ఘనతను సాధించింది. తన కుటుంబానికున్న సమస్యలను చదువు ద్వారా అధిగమించాలన్న పట్టుదలతో చదివినట్టు సంగీత ఈసందర్భంగా తెలిపింది.



దాసరి శాంతి



మేఘన



సంగీత

బెదిరింపులకు భయపడం...

- 24 గంటల నిరాహార దీక్షలో అంగన్వాడీలు
- ఎస్మా ప్రయోగంపై వెల్లువెత్తుతున్న నిరసనలు
- బెదిరించడం మాని సమస్యలు పరిష్కరించండి
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్



జీవో ప్రతులను దగ్ధం చేస్తున్న అంగన్వాడీలు, నాయకులు



24 గంటల నిరాహార దీక్షలో కూర్చొన్న అంగన్వాడీలు, మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్. వెంకటేష్

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

తమ సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వం ఎన్ని బెదిరింపులు చేసినా భయపడే ప్రసక్తి లేదని అంగన్వాడీలు హెచ్చరించారు. తమ డిమాండ్ల సాధన కోసం పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం ముందు అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 26వ రోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం విడుదల చేసిన ఎస్మా జీవో ప్రతులను ఆర్డీవో కార్యాలయం ముందు దగ్ధం చేశారు. అంతకు ముందు నాయకులు మాట్లాడుతూ 26 రోజుల నుండి వివిధ దశలలో అంగన్వాడీలు నిరసనలు తెలియజేసినా ప్రభుత్వ పెద్దలలో ఎలాంటి చలనం రాలేదన్నారు. సమ్మెను ఉధృతం చేయడంలో భాగంగా 24 గంటల నిరాహార దీక్షలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ దిల్షాద్ మాట్లాడుతూ అంగనవాడీ హెల్పర్స్ వర్కర్స్ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వివిధ దశల్లో నిరసనలు చేపట్టిన ప్రభుత్వం కనికరించలేదన్నారు. ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా ఉద్యమాన్ని రోజురోజుకూ ఉధృతం చేస్తున్నామన్నారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకం వల్ల ధరలు పెరగడమే కాక అంగన్వాడీ కేంద్రాల లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారంలో సైతం కోతలు పడుతున్నాయన్నారు. అంగన్వాడీల సమ్మెను నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా భయపడేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల జిల్లా ప్రధాన కార్యదర్శి వి శ్రీదేవి, జిల్లా కోశాధికారి ఎస్ దేవి, ఓడిసి ప్రాజెక్టు కార్యదర్శి రంగమ్మ, అధ్యక్షురాలు అశ్వర్థమ్మ, ధర్మవరం ప్రాజెక్ట్ కార్యదర్శి చంద్రకళ, సికేపల్లి ప్రాజెక్టు అధ్యక్షురాలు రమణమ్మ, గుడిబండ అధ్యక్షురాలు నాగమణి, పుట్టపర్తి అధ్యక్షురాలు శ్రావణి , బ్యాళ్ల అంజి తదితరులు పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగం దుర్మార్గం : అంగన్వాడీల సమ్మెపై ఎస్మాను ప్రయోగిస్తూ జీవో 2 ను జారీ చేయడం రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వ వైఖరికి నిదర్శనంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం అంగన్వాడీల 24 గంటల నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించిన ఆయన వారి దీక్షలకు మద్దతు పలికారు. ఈసందర్భంగా అంగన్వాడీలతో కలసి ఎస్మా జీవో ప్రతులను దగ్ధం చేశారు. అనంతరం ఇంతియాజ్ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమన్నారు. వెంటనే జీవో 2 ను ఉప సంహరించాలని డిమాండ్ చేశారు. న్యాయబద్ధమైన సమ్మెను నిరంకుశ చర్యల ద్వారా విచ్ఛిన్నం చేయాలనుకోవడం తీవ్ర అభ్యంతరకరం అన్నారు. ప్రభుత్వ వైఖరిని ఇలాగే కొనసాగితే జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల బైక్‌ర్యాలీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు శనివారం పుట్టపర్తి లోని గణేష్ కూడలి వద్ద బైక్ ర్యాలీ నిర్వహించారు. 18వ రోజు సమ్మెలో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖ సమగ్రశిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు పెద్ద ఎత్తున పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం నుండి గణేష్ సర్కిల్ వరకు నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అంతకుమునుపు పుట్టపర్తి ఎంఆర్‌సి కార్యాలయం ముందు బైటాయించి ధర్నా కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జెఎసి జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమైన విద్యాశాఖలో గత 20సంవత్సరాల నుండి పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. 20 సంవత్సరాలు నుండి విద్యాశాఖలో అనేక విభాగాల ఉద్యోగులు పనిచేస్తున్నామన్నారు. అయితే ఇంతవరకు ఉద్యోగులకు ప్రభుత్వం కల్పించాల్సిన కనీస వేతనం, వేతనాల పెంపు, సమాన పనికి సమాన వేతనం, వేతనంతో కూడిన మెడికల్ లీవులు, చైల్డ్ కేర్ లీవ్‌లు, పిఎఫ్, ఇఎస్ఐ, ఉద్యోగ భద్రత ఇవేవీ కల్పించలేదన్నారు. శ్రమ దోపిడీకి గురి చేస్తూ అతి తక్కువ వేతనాలతో పనిచేయిస్తోందన్నారు. ఉద్యోగ భద్రత కూడా కల్పించకుండా ఈరోజు ఉద్యోగుల్ని బెదిరించే స్థాయికి దిగజారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం విజయవాడలో జరిగిన చలో ఎస్ పి డి(రాష్ట్ర పథక అధికారి) కార్యాలయ ముట్టడి కార్యక్రమంలో రాష్ట్రంలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు వేలాదిగా పాల్గొంటే పోలీసుల చేత నిర్బంధించడం అమానుషమని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి, ఇఎస్ వెంకటేష్, జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్న, రవి, నాగరాజు, ఓబులేసు, భవాని, స్రవంతి, సోమశేఖర్, రాజశేఖర్, కృష్ణమూర్తితో పాటు జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఎస్ఎస్ఎ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఎస్ఎస్ఎ ఉద్యోగుల బైక్‌ర్యాలీ

అందరికీ అందుబాటులో ఉంటా : మంత్రి ఉషశ్రీచరణ్



కౌన్సిలర్ జయశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రేన్‌సాయంతో మంత్రికి యాపిల్‌మాల వేస్తున్న దృశ్యం



మంత్రితో కరచాలనం చేస్తున్న గోరంట్ల ఉపసర్పంచి రాజారెడ్డి

ప్రజాశక్తి -పెనుకొండ

అందరికీ అందుబాటులో ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. మంత్రి ఉషశ్రీచరణ్ పెనుకొండ సమన్వయకర్తగా మొట్టమొదటిసారి పట్టణానికి రావడంతో శనివారం నియోజకవర్గంలోని వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద మంత్రి మీడియాతో మాట్లాడారు. సిఎం జగన్ ఆదేశాల మేరకు పెనుకొండకు ఎమ్మెల్యే అభ్యర్థిగా వచ్చానని, పార్టీ శ్రేణులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలకడం సంతోషంగా ఉందన్నారు. మా జెండా.. అజెండా జగనే అన్నారు. ఆయన ఆదేశాలను శిరసా వహిస్తామన్నారు. అంతకుముందు మంత్రికి అమ్మవారిపల్లిలో ఎమ్మెల్సీ మంగమ్మ, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ పొగాకు రామచంద్ర, హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం భారీ కాన్వాయ్‌తో మంత్రి పెద్ద చెరువు కట్ట ఆంజనేయ స్వామి ఆలయం వెళ్లారు. అక్కడ మంత్రికి నియోజకవర్గ పరిశీలకులు బాబు రెడ్డి, ఎజిపి భాస్కర్‌రెడ్డి, వైసిపి నాయకులు సుధాకర్‌రెడ్డి, గంపల రమణారెడ్డి, వైశాలి జయారెడ్డి,గీతా రామ్మోహన్‌రెడ్డి, సూర్య ప్రకాష్ రెడ్డి, పద్మావతి అక్కులప్ప, నారాయణరెడ్డి, బాలాజీ, నల్లపరెడ్డి కృష్ణారెడ్డి, తదితరులు పూలబొకేలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం భారీ కాన్వాయ్‌తో పట్టణంలోకి చేరుకున్నారు. మార్కెట్ యార్డ్ వద్ద బాణసంచా పేల్చి మంత్రికి స్వాగతం పలికారు. దర్గా సర్కిల్‌లో క్రేన్ సాయంతో యాపిల్ గజమాల వేశారు. అక్కడి నుంచి నడుచుకుంటూ బాబయ్యస్వామి దర్గా వద్దకు చేరున్నారు. మహల్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భర్త చరణ్‌తో కలిసి చాదర్‌ను సమర్పించారు.

పెనుకొండలో మంత్రికి ఘనస్వాగతం

గోరంట్ల రూరల్ : పెనుకొండ నూతన సమన్వయకర్త, మంత్రి ఉషశ్రీచరణ్‌కు గోరంట్ల ఉప సర్పంచి రాజారెడ్డి వైసిపి శ్రేణులతో 50 వాహనాల్లో తరలివచ్చి ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారిపల్లి వద్ద జై జగన్, జై ఉషమ్మ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో గంపల రమణారెడ్డి, కంగారెడ్డిపల్లి గోవిందరెడ్డి, కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నాగరాజు, జయచంద్రారెడ్డి, నరేంద్రరెడ్డి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంచాలి : ఎస్పీ



లేపాక్షిలో స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి-లేపాక్షి

స్టేషన్‌కు వచ్చే బాధితుల న్యాయపరమైన సమస్యలను సత్వరమే పరిష్కరించి ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై నమ్మకం పెంచాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఎస్పీ శనివారం లేపాక్షి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి స్టేషన్‌లోని రికార్డులు, గదులను పరిశీలించారు. కేసులపై సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉంటూ అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తరచూ తనిఖీలు చేపట్టాలన్నారు. గ్రామస్థాయిలో పరిస్థితులను లోతుగా అధ్యయనం చేయాలన్నారు. సిబ్బంది పనితీరు, సమస్యలపై ఆరా తీశారు. వృత్తి నైపుణ్యం పెంచుకోవా లని, సాంకేతికంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించి గ్రామాల్లో మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తరచూ గ్రామ సందర్శ న చేయాలని, సైబర్ నేరాలు, దిశా యాప్ వంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే వారి వివరాలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, చోరీల కట్టడిపై దృష్టి పెట్టాలన్నారు. రాత్రివేళ గస్తీలు, సాయంత్రం వేళ రోడ్డుపై విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఎస్పీ వెంట హిందూపురం డీఎస్పీ కంజాక్షన్, సిఐ వేణుగోపాల్, సిసి రాఘవేంద్ర, ఎస్ఐ గోపి, మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన ఎస్పీ

పుట్టపర్తి రూరల్ : ఎపి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను జిల్లా ఎస్పీ మాధవరెడ్డి శనివారం కలిసి పూలబొకే అందజేశారు. అనంతపురం జిల్లా పర్యటన సందర్భంగా గవర్నర్ బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో వెళ్తున్న సందర్భంగా జిల్లా సరిహద్దు ప్రాంతమైన రక్ష అకాడమీలో ఎస్పీతో పాటుకలెక్టర్ పి.అరుణ్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్ రాక సందర్భంగా జిల్లా వ్యాప్తంగా భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. జిల్లా పరిధి దాటేంత వరకూ దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమన్వయంతో విజయం సాధిస్తాం



సమావేశంలో పాల్గొన్న శాంత, స్థానిక నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పార్లమెంట్ వ్యాప్తంగా ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అందరినీ కలుపుకొని వచ్చే ఎన్నికల్లో మరోసారి విజయఢంకా మోగిస్తామని వైసిపి పార్లమెంట్ సమన్వయకర్త శాంత పేర్కొన్నారు. సమన్వయకర్తగా ప్రకటించిన అనంతరం మొదటిసారి ఆమె హిందూపురం రాగా వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా ఆమె పట్టణంలోని సూగూరు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వాల్మీకి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం పార్టీ కార్యాలయం చేరుకోగా ఇన్‌ఛార్జి దీపిక, ఇతర నాయకులు ఘనంగా స్వాగ తం పలికారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ సిఎం జగన్ మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నార న్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అన్ని సామాజిక వర్గాలకు సమపాళ్లలో అవకాశాలు అందిస్తున్న ఏకైక పార్టీ వైసిపి అన్నారు. ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకూ నియోజకవర్గాల్లో చేపట్టే మంత్రి పెద్దిరెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు వేణురెడ్డి, అబ్దుల్ ఘని, జనార్ధన్‌రెడ్డి, నక్కలపల్లి శ్రీరామిరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

వైసిపి పార్లమెంట్ సమన్వయకర్త శాంత

స్ట్రాంగ్ రూముల కోసం గదుల పరిశీలన

ప్రజాశక్తి-లేపాక్షి

ఓట్ల లెక్కింపు, స్ట్రాంగ్ రూముల కోసం శనివారం కలెక్టర్ పి.అరుణ్‌బాబు మండల పరిధిలోని బిసలమనేపల్లి పంచాయతీ నాయనిపల్లి క్రాస్‌లో ఉన్న అంబేద్కర్ గురుకుల ఉన్నత పాఠశాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ముందస్తు ఏర్పాట్ల నేపథ్యంలో పాఠశాలలోని డార్మెంటరీ, తరగతి గదులు, ప్రిన్సిపల్ రూము, ల్యాబ్‌లను పరిశీలించామన్నారు. రెవెన్యూ అధికారులు తయారుచేసిన మ్యాపులను క్షుణ్ణంగా పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల్లో మంచి వెలుతురు ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలోని గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్‌లను పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, పెనుగొండ సబ్ కలెక్టర్ భరత్, తహశీల్దార్ బాబు, అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అలుపెరగని పోరాటం



ధర్మవరంలో ఖోఖో ఆడి నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు



చిలమత్తూరులో గొర్రెకు వినతి పత్రం ఇస్తున్న అంగన్వాడీలు



తలుపులలో అంగన్వాడీల నిరాహార దీక్ష



సమ్మెలో భాగంగా అంగన్వాడీలు 26వ రోజైన శనివారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. వీరికి సిఐటియు, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మాకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. జిఒ-2 ప్రతులను దహనం చేశారు. చిలమత్తూరులో గొర్రెకి వినతి ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి-హిందూపురం

నిర్బంధాలు, బెదిరింపులకు భయపడేది లేదని, సమ్మె కొనసాగిస్తామని అంగన్‌వాడీలు తేల్చి చెప్పారు. సమ్మెలో 26వ రోజైన శనివారం పట్టణంలోని సద్భావన సర్కిల్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో సిఎం జగన్ చిత్రపటాని తుంచి ఫొటో ముందు 'వైసిపి గోవిందా .... గోవిందా' అంటూ పొర్లు దండాలు పెట్టారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి లావణ్య మాట్లా డుతూ మహిళలు అని కూడా చూడకుండా ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం, జిఒ-2 తీసుకొచ్చి 6 నెలల పాటు సమ్మెలు, నిరసనలు నిషేధమంటూ తాజా ఉత్తర్వుల్లో పేర్కొనడం సిఎం జగన్ చేతగాని తనానికి నిదర్శనం అన్నారు. మాట తప్పిన ముఖ్యమంత్రికి ఎన్నికల్లో గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శిరీష, వరలక్ష్మి, పద్మ, రిహానా, అంగన్వాడీలు పాల్గొన్నారు.

భగ్గుమన్న అంగన్వాడీలు..

పెనుకొండ : అంగన్వాడీలు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సమ్మెను కొనసాగిం చారు. అటుగా రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ ర్యాలీగా వస్తుండడంతో అంగన్వాడీలు మంత్రికి వినతి పత్రం ఇచ్చేందుకు ప్రత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తోపులాట చోటుచేసుకోగా అంగన్వాడీ కార్యకర్త నారాయణమ్మ అస్వస్థతకు గురవడంతో స్థానిక ప్రభుత్వా సుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులపై అడ్డుకోవడంపై అంగన్వాడీలు అగ్రహం వ్యక్తం చేస్తూ మంత్రి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకు రాళ్లు బావమ్మ, జయమ్మ, సెక్టార్ నాయకురాళ్లు మాబున్నీసా పాల్గొన్నారు. అంగన్వాడీల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం రాజ్యాంగ హక్కులను కాలరాయ డమేనని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పెద్దన్న పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. అంగన్వాడీల సమ్మెకు అండగా ఉందామని వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కూలీలను కోరారు. అంగన్వాడీల సమ్మెపై ఎస్మాను ప్రయోగిస్తూ జిఒ-2 జారీ చేయడాన్ని ఎపి వ్య.కా.సం. జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. తక్షణమే జిఒను ఉపసంహరించి వారితో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ధర్మవరం టౌన్ : అంగన్వాడీ కార్యకర్తలను అక్క, చెల్లెమ్మలుగా భావిస్తున్నానని చెప్పిన సిఎం జగన్ ఇచ్చిన మాట తప్పారని అంగన్వాడీలు పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెను కొనసాగించారు. శిబిరం వద్ద ఖోఖో ఆడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. వీరికి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎల్, ఆదినారాయణ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఎస్మాకు భయపడే ప్రసక్తే లేదు

కదిరి అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎస్మాకు భయపడే ప్రసక్తే లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. ప్రభుత్వ తాటాకు చప్పుళ్లకు భయపడి ఆందోళన విరమిస్తామనుకుంటే పొరపాటని అంగన్వాడీ వర్కర్స్, సిఐటియు నాయకులు జిఎల్ నరసింహులు, బాబ్‌జాన్, మాబున్నీసా పేర్కొన్నారు.

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం ముందు అంగన్వాడీలు సమ్మెను కొనసాగించా రు. ప్రభుత్వం స్పందించకపోవడంతో శిబిరంలో అంగన్వాడీ ప్రాజెక్టు లీడర్లు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. శిబిరాన్ని సిఐటియు నాయకులు ఈఎస్.వెంకటేష్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్ సందర్శించి సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మెను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం ఉద్యోగం నుంచి తొలగించమని జీఓలు జారీ చేయడం పట్ల మండిపడ్డారు. జిఒ ప్రతులను ఆర్డీవో కార్యాలయం ముందు దహనం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీదేవి, జిల్లా కోశాధికారి ఎస్.దేవి, రంగమ్మ, అశ్వత్థమ్మ, చంద్రకళ, రమణమ్మ, నాగమణి, శ్రావణి , బ్యాళ్ల అంజి పాల్గొన్నారు.

ముదిగుబ్బ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన దీక్షలో సిపిఎం, సిఐటియు నాయకులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీలపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించ డాన్ని ఖండిస్తున్నామని, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, బండల వెంకటేశు, నాగప్ప, రజియా పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ ముందు అంగన్వాడీలు చేపట్టిన దీక్షలకు టిడిపి సీనియర్ నాయకులు ఎద్దుల రాముడు మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు సిఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

నంబులపూలకుంట : స్థానిక బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో అంగన్వాడీలు 'వైకుంఠ నారాయణ గోవిందా గోవిందా'.. మీరైనా సిఎం జగన్ మనసు మార్చి మా డిమాండ్లను తీర్చమని ప్రార్థించారు. వీరికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు.

లేపాక్షి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీ సిబ్బంది రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఎస్మా ప్రయోగించడం తగదన్నారు. కార్యక్రమంలో నరసింహప్ప, ధనమ్మ, రత్నమ్మ, పార్వతి, మాధవి, శివమ్మ, భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు

గుడిబండ : అంగన్వాడీలు నిరవధిక సమ్మెను కొనసాగించారు. కార్యక్రమంలో గుడిబండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యదర్శి మహదేవమ్మ, కోశాధికారి లక్ష్మీదేవి, మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

గొర్రెకి వినతి

చిలమత్తూరు : సమ్మెలో భాగంగా అంగన్వాడీలు తహశీల్దార్ కార్యాలయం ముందు వినూత్నంగా గొర్రెకు వినతి పత్రం అందజేశారు. సమ్మెకు ఎస్సీ సంఘం నాయకులు నరసింహప్ప, మైనారిటీ సంఘం నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో శోభమ్మ, పద్మావతి, బృందమ్మ పాల్గొన్నారు.

మడకశిర : సమస్యల సాధనకోసం పోరాటం చేస్తున్న అంగనవాదీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా అమలు చేయడం దారుణ చర్య అని టిడిపి జిల్లా కార్యదర్శి ఎస్.రవిభూషణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగనవాడీలకు టిడిపి మద్దతుగా ఉంటుందన్నారు.



ఎస్.రవిభూషణ్





పెనుకొండలో పెద్దన్న ఆధ్వర్యంలో ర్యాలీ , తోపులాటలో సొమ్మసిల్లిన మహిళ



లేపాక్షిలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

పింఛన్ల పంపిణీ



పింఛన్లను పంపిణీ చేస్తున్న మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మాసపల్లి సాయికుమార్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని 9వ వార్డు లింగిశెట్టి పాలెంలో శనివారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాసపల్లి సాయికుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సాయి కుమార్ మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు సిఎం జగన్ పింఛన్ల మొత్తాన్ని రూ. 3వేలకు పెంచార న్నారు. టిడిపి పాలనలో పింఛను అందాలంటే పంచాయతీ ఆఫీసులో ఎదురుచూసే పరిస్థితి ఉండేద న్నారు. జన్మభూమి కమిటీ ఎవరిని నిర్ణయిస్తే వారికే అందేదన్నారు. జగన్ పాలనలో అర్హులందరికీ పింఛనుతో పాటు సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో వార్డు వాలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, పింఛనుదారులు, పాల్గొన్నారు.

ప్రతిపక్షాలన్నీ ఏకమై కేతిరెడ్డిని ఓడిస్తాం : చిలకం

ప్రజాశక్తి-ధర్మవరం

వైసిపిలో తిరుగుబాటు మొదలైంది.. ఇక జగన్ పని అయి పోయినట్టే.. ప్రతిపక్షాలన్నీ ఏమమై స్థానికంగా కేతిరెడ్డిని ఓడించడమే లక్ష్యమని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూ దన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ రాష్ట్రంలో వైసిపి పని అయిపోయిందని, జగన్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు మూటముల్లె సర్దుకోవాల్సిందేనన్నారు. కేతిరెడ్డి వ్యతిరేక ఓట్లను చీలనివ్వకుండా ఆయనను ఇంటికి పంపడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తాన్నారు. పాలన అస్తవ్యస్తంగా తయారైందని, టీడీపీ, జనసేన ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. ప్రభుత్వం అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, ఎస్ఎస్ఎ ఉద్యోగులను పట్టించుకున్న పాపానపోలేదన్నారు. తల్లి, చెల్లిని గౌరవించలేని సిఎం జగన్ పక్కవారిపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. త్వరలోనే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ స్థానాలు ప్రకటిస్తారన్నారు.

వివక్షకు తావులేని వైసిపి పాలన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నల్లచెరువు

'వైఎస్ఆర్ పింఛను కానుక' కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి లబ్ధిదారులకు పెంచిన పింఛను సొమ్ము పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ ఇచ్చిన మాట తప్పలేదని, చెప్పింది చేయడమే కాకుండా చెప్పనటువంటి హామీలను అమలు చేశారన్నారు. వివక్షకు తావు లేకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నార న్నారు. నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పరితపిస్తున్న జగన్‌కు అందరి అండదండలు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శకుంతల, ఎంపీపీ కే.రమణరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బట్టి హైదర్ వలి, వైస్ ఎంపీపీ, నారాయణస్వామి, సర్పంచి పంచరత్నమ్మ, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేతిరెడ్డి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-బత్తలపల్లి

రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో ప్రజలకు మంచి చేస్తున్న వైసిపికి మద్దతివ్వాలని, లాస్ట్ ఛాన్స్ అంటూ మభ్యపెట్టే టిడిపి అధినేత చంద్రబాబుకి మరోసారి బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మాల్యవంతం పంచాయతీ వెంకటగారిపల్లి, అనంతసాగరం, చీమలనాగేపల్లి గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే ఇంటింటా ప్రచారం నిర్వహించి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో స్థానిక నాయకులు ఎమ్మెల్యేకి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి, నాయకులు కమతం రశ్వరయ్య, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, బగ్గిరి బయపురెడ్డి, ప్రతాపరెడ్డి, అనంతరెడ్డి, పురుషోత్తంరెడ్డి, గోపాల్‌రెడ్డి, యెగానందచారి, కార్యకర్తలు తరలివచ్చారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-మడకశిర

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని ఐసిడిఎస్ సిడిపిఒ నాగమల్లేశ్వరి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఆర్.డి.టి, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన 'బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత' కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా సిడిపిఒతో పాటు ప్రొటెక్షన్ అధికారి నాగలక్ష్మి, హెచ్ఎం రామంజనమ్మ హాజరయ్యారు. చిన్న వయసులో వివాహం చేయడం వల్ల కలిగే అనర్థాలను సిడిపిఒ వివరించారు. బాల్య వివాహం చేసినా, సహకరించినా శిక్షార్హులవుతారన్నారు. బాల్య వివాహాల పై 1098, 100, 112కు సమాచారం ఇవ్వాలన్నారు. ఆదినారాయణ మాట్లాడుతూ బాల్యవివాహాలు, లైంగిక వేధింపులు, మంచి స్పర్శ, చెడు స్పర్శ, తదితర అంశాలపై లఘు చిత్రాల ద్వారా తల్లిదండ్రులు, చిన్నారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆనంద్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

తిప్పేస్వామికే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి-మడకశిర

మడకశిర ఎమ్మెల్యే టికెట్ మరోమారు తిప్పేస్వామికే కేటాయించాలని కోరుతూ నియోజకవర్గంలోని వైసిపి ముఖ్య నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు శనివారం విజయవాడలో సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి విన్నవించారు. వెళ్లిన వారిలో ఆగలి మండలం నుంచి మహేంద్ర, సర్పంచులు నటరాజు, కృష్ణప్ప, అమలాపురం నుంచి సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఇతర ముఖ్య నాయకులు ఉన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

మడకశిర : టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి మల్లినమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని అగ్రహారం, బిజి హళ్లి గ్రామపంచాయతీలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. సూపర్‌సిక్స్ పథకాలు, మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుస్తులు పంపిణీ

కొత్తచెరువు రూరల్ : స్థానిక నాగిరెడ్డిపల్లి రోడ్డులో, నల్లకొండ గుడిసెల్లో ఉంటున్న నిరుపేదలకు శనివారం సత్యసాయి బాబా భక్తురాలు సహకారంతో ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో షామీర్ 80 కుటుంబాలకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. షామీర్ మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, బాబా భక్తుల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో షాకీర్, రాజు, సాయి, శ్రావణ్, సోహెల్, సలీం, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల పోరు ఉధృతం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సమ్మెలో భాగంగా 12వ రోజైన శనివారం మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం సిఐటియు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించి కమిషనర్, ఉద్యోగులు, ఛైర్మన్, వైసిపి నాయకులను బయటకు పంపి తలుపులు మూసి నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రత, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసేంత వరకూ పోరాటం ఆగదన్నారు. వీరి సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు గౌస్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్, యూనియన్ నాయకులు నాగార్జున, పెద్దన్న, గోవిందు, నరసింహులు, రామయ్య, కార్మికులు రామదాసు, రమేష్, నాగరాజు, నాగభూషణ, పోతలయ్య పాల్గొన్నారు.

కార్యాలయాల ముట్టడి

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో పుట్టపర్తిలో పలు వీధుల్లో చెత్తచెదారం పేరుకుపోయింది. ఆర్టీసీ బస్టాండ్ వెనుకవైపు వీధిలో దుకాణదారులు దుర్వాసన భరించలేక చెత్తను సంచుల్లో నింపడం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కార్మికులు అక్కడికి చేరుకొని మా సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ చెత్త చెదారం ఎవరూ ముట్టుకో రాదని వాదించడంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. చివరకు శాంతించిన కార్మికులు సంచుల్లో నింపండి కానీ ఎత్తివేసే ప్రయత్నం చేయవద్దని సూచించి వెళ్లిపోయారు.

కదిరి అర్బన్ : మున్సిపల్ కార్మికులు సమ్మెను కొనసాగించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు.



ధర్మవరంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించిన కార్మికులు

మా కడుపు కొట్టొద్దు సార్

పెనుకొండ : నగర పంచాయతీ పరిధిలో పారిశుధ్య కార్మికులు సమ్మెను కొనసాగిస్తున్నారు. పెనుకొండకు మంత్రి ఉషశ్రీ రావడంతో అధికారులు, కమిషనర్ ప్రయివేట్ వ్యక్తులతో పారిశుధ్య పనులు చేయిస్తుండడంతో విషయం తెలుసుకున్న సిఐటియు నాయకులు, కార్మికులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి కార్మికులను అడ్డుకోవడంతో 'మా కడుపు కొట్టొద్దు సార్' అంటూ పారిశుధ్య కార్మికులు రోడ్డుపై బైఠాయించి ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

ధర్మవరం టౌన్ : సమ్మెలో భాగంగా పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారు పెద్దక్క, వెంకటేశులు, సెక్రటరీ చెన్నకేశవులు, కోశాధికారి లక్ష్మీఓబుళేసు, ఉపాధ్యక్షుడు ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ముకుంద, ఔట్‌సోర్సింగ్ ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగ కార్మిక సంఘం అధ్యక్షుడు అద్రామహేశ్, ప్రధాన కార్యదర్శి బొగ్గు నాగరాజు, సహాయ కార్యదర్శి సాకే బాబు, కోశాధికారి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు దాసరి సురేశ్, అంకే పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.



పుట్టపర్తిలో మున్సిపల్ కార్యాలయంలో బైఠాయించిన కార్మికులు



కదిరిలో శిబిరంలో కూర్చున్న మున్సిపల్ కార్మికులు

'ఎపిని కాపాడుకుందాం' : కందికుంట

కదిరి అర్బన్ : అరాచక పాలకుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుని అభివృద్ధి బాటలో నడుపుకుందాం అందరూ కదిలి రండి అని నియోజ కవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. 'రా కదలి రా' కార్యక్రమం ద్వారా సైకో జగన్ అరాచకాలను ప్రజలకు వివరించి, రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. 'రా కదలి రా' కార్యక్రమం ద్వారా ప్రజలను చైతన్యపరచాలన్నారు. వైసిపి పాలనలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు దగాపడ్డారన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు భూములు కబ్జా అయ్యాయన్నారు. లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి బాటలో నడవాలంటే చంద్రబాబు సిఎం కావాలని పిలుపునిచ్చారు.

రూ. 10 లక్షలు పట్టివేత

చిలమత్తూరు : ఎలాంటి రసీదు లేకుండా స్కూటీలో తరలిస్తున్న రూ. 10 లక్షల నగదును శని వారం ఆదాయపన్ను శాఖకు అప్పగించినట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. కర్నాటకలోని చిక్కబాలాపూర్‌కి చెందిన మహ్మద్‌అలీ బాగేపల్లి వైపు నుంచి ఆంధ్ర వైపు స్కూటీలో వస్తుండగా కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద సెబ్ పోలీసులు తనిఖీ చేయగా సీటు కింద డిక్కీలో రూ. 10 లక్షలు పట్టుబడింది. దానికి సంబంధించి ఎలాంటి రసీదు లేకపోవడంతో ఆదాయపన్ను శాఖకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయస్థాయి జూడో పోటీలకు చిగిచెర్ల విద్యార్థులు

ధర్మవరం టౌన్ : గత అక్టోబర్‌లో మండల పరిధిలోని చిగిచెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ జూడో పోటీల్లో చిగిచెర్ల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం తిమ్మారెడ్డి, పిడి ప్రతాపరెడ్డి తెలిపారు. మైనస్ 48 కిలోల వైట్ కేటగిరీలో శ్రీనిత్య, మైనస్ 52 వైట్ కేటగిరీలో యశస్విని బంగారు పతకాలు సాధించారన్నారు. వీరు ఈ నెల 6 నుంచి పంజాబ్‌లో జరిగే జాతీయస్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థినులను హెచ్ఎం, పిడితో పాటు ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

ధర్మవరం టౌన్ : మండల వ్యాప్తంగా ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకూ పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు ఎంఇఒలు రాజేశ్వరిదేవి, గోపాల్‌నాయక్ తెలిపారు. వారు మాట్లా డుతూ సంక్రాంతి సెలవుల్లో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు తరగతులు నిర్వహించరాదని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నెల 19వ తేదీ పాఠశాలలను పునఃప్రారంభించాలన్నారు.

రౌడీయిజం లేని ధర్మవరాన్ని నిర్మిద్దాం : పరిటాల శ్రీరామ్



శ్రీరామ్ సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రౌడీయిజంలేని ధర్మవరాన్ని నిర్మించడమే లక్ష్యంగా పని చేస్తానని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. ప్రజాచైతన్య పాదయాత్రలో భాగంగా 3వ రోజైన శనివారం పరిటాల శ్రీరామ్ పట్టణంలోని పలు కాలనీల్లో పర్యటించారు. 32వ వార్డు పరిధిలోని సత్యసాయినగర్‌లో ఉన్న అన్నపూర్ణేశ్వరి ఆలయం నుంచి పాదయాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి గిర్రాజుకాలనీ, దుర్గా నగర్, సుందరయ్య నగర్, ప్రియాంకనగర్, లక్ష్మీచెన్నకేశవపురం, ఇందిరమ్మకాలనీ వరకూ పాదయాత్ర సాగింది. పాదయాత్రలో ప్రజలు పలు సమస్యలను విన్నవించారు. శ్రీరామ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కేతిరెడ్డి గుడ్ మార్నింగ్ ద్వారా ఏ సమస్యలు పరిష్కరించారని ప్రశ్నించారు. నా పాదయాత్రలో సమస్యలు తెలిపేవారిని బెదిరిస్తున్నారన్నారు. ప్రజలు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, టిడిపి అండగా ఉంటుందన్నారు. అనంతరం పట్టణంలోని 32వ వార్డుకు చెందిన సాధిక్, రిజ్వాన్‌ఖాన్, షామీర్ తమ అనుచరులైన 40 కుటుంబాలతో కలిసి టిడిపిలో చేరగా వారికి శ్రీరామ్ టిడిపి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

తగాదాల జోలికి వెళ్లొద్దు : జడ్జి



సబ్ జైలును తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి శ్రీధర్

హిందూపురం : చిన్నపాటి వివాదాలను తగాదాలుగా చేసుకొని జైలకు వచ్చి ఇబ్బందులు పడవద్దని సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ సబ్ జైలులో ఉన్న నిందితులకు సూచించారు. జడ్జి శనివారం పట్టణంలోని సబ్ జైలును తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడి పలు విషయాలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ కక్షల జోలికి వెళ్లకుండా ప్రశాంత జీవనం గడపాలన్నారు. పదే పదే తప్పులు చేసి జైలుకు వస్తే పాత నేరస్తుల జాబితాలోకి వెళ్లాల్సి వస్తుందన్నారు. ఆయన వెంట జైలు అధికారి అంజినాయక్, న్యాయవాదులు జ్ఞానేష్, నవేరా, ఉన్నారు.

ప్రశాంత జీవనం గడపాలి : అదనపు జిల్లా జడ్జి

ప్రజాశక్తి-హిందూపురం

వృద్ధాశ్రమంలో ఉన్న వారు ప్రశాంత జీవనం గడపాలని జిల్లా అదనపు న్యాయమూర్తి శైలజ సూచించారు. జడ్జి శనివారం పరిగి మండల పరిధిలోని ప్రశాంతి మందిరం వృద్ధాశ్రమంలో జరిగిన సీనియర్ సిటిజన్స్ అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. విజ్ఞానం పెరుగుతున్న కొద్దీ తల్లిదండ్రుల పట్ల ప్రేమానురాగాలు సన్నగిల్లిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుమారులు, కుమార్తెలు తల్లిదండ్రుల పట్ల బాధ్యతతో మెలగాలన్నారు. వృద్ధులు ఎవరైనా నిరాదరణకు గురైతే దరఖాస్తు చేసుకుని న్యాయం పొందవచ్చు అన్నారు. అనంతరం వృద్ధులతో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు వలసల పంచమిముక్తి, న్యాయవాదులు కళావతి, పార్వతి, సంతోషికుమారి, నవేరా, వన్నెరప్ప, లోక్ అదాలత్ సిబ్బంది శారద, తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపొందించాలి

కొత్తచెరువు : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలని పర్యావరణవేత్త భాస్కర్‌నాయుడు సూచించారు. స్థానిక నారాయణ పాఠశాలలో శనివారం పర్యావరణ విశిష్టతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెట్లను పెంచడం ద్వారా ఆక్సిజన్ ఉత్పత్తి అవుతుంద ని, ఇది మానవులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు స్కూలు వద్ద ఇంటి వద్ద తప్పక మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. చెట్ల పెంపకం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చు అన్నారు విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గురుప్రసాద్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు వేయించండి

బత్తలపల్లి : గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు క్రమం తప్పకుండా సక్రమంగా టీకాలు వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ కృష్ణయ్య వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది హాజరు, టీకాల శీతలీకరణ నిర్వహణను, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. వైద్య సిబ్బందితో సమావేశమై చిన్నారులకు అన్ని రకాల టీకాలను సకాలంలో అందజేయాలని ఆదేశించారు. వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్షించి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి రామకృష్ణ, ఫార్మాసిస్ట్ సరస్వతి, స్టాఫ్ నర్సు సుకన్య, ల్యాబ్ టెక్నీషియన్ రాఘవేంద్ర, సిహెచ్ రాజశేఖర్, సూపర్వైజర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బహిరంగ వేలం వాయిదా

హిందూపురం : పట్టణంలోని పరిగి బస్టాండులో ఖాళీ జాగా, షాపుల నిర్వహణ కోసం ఈ నెల 9వ తేదీ నిర్వహించాల్సిన బహిరంగ వేలాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. కమిషనర్ శనివారం తన ఛాంబర్‌లో మాట్లాడుతూ పరిగి బస్టాండ్‌లోని పురపాలక సంఘం ఆధీనంలో ఉన్న వాణిజ్య భవనాలకు యథావిధిగా వేలం నిర్వహిస్తున్నామన్నారు. షాపుల నిర్వహణ కోసం కేటాయించిన ఖాళీ స్థలం బహిరంగ వేలాన్ని రద్దు చేశామన్నారు. అద్దె విషయంలో అందిన ఫిర్యాదులను పరిశీలిస్తామన్నారు. షాపుల నిర్వహణ కోసం కేటాయించిన ఖాళీ స్థలానికి త్వరలో బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు.

గ్రామాల్లో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి : మండల పరిధిలోని మాల్యవంతం, అనంతసాగరం, తంబాపురం గ్రామాల్లో రైతులు సాగు చేసిన కంది పంటలో శనివారం ఎఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ ఆధ్వర్యంలో వీఎస్ఏ లావణ్యలత, వీఏఏ సునీత పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఎఎస్ఒ మాట్లాడుతూ వైయస్సార్ ఉచిత బీమా, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద కందిపంటలో పంటకోత ప్రయోగాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ ఉపేంద్రరెడ్డి, రైతులు నారాయణ, ఈశ్వరయ్య, నారాయణమ్మ పాల్గొన్నారు.

పిహెచ్‌సి తనిఖీ

లేపాక్షి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ టీమ్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. జాతీయ పథకాల గురించి వివరించారు. అనంతరం కంచి సముద్రం రోడ్డులోని వివేకానంద స్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య సూచనలు చేశారు. లేపాక్షి సచివాలయం-2ను సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజ్మెంట్ ఆఫీసర్ కెసికె నాయక్, డిపిఒ నాగరాజు, కళాధర్, సుబ్బారావు, డాక్టర్ చిరంజీవి, డాక్టర్ రాజ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

టిడిపితోనే బిసిల ఆత్మగౌరవం

ప్రజాశక్తి-బుక్కపట్నం

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, సంక్షేమం, రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యం టిడిపితోనే సాధ్యమని జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. బుక్కపట్నంలో శనివారం ఆయన మాట్లాడుతూ టిడిపి అధికాంలోకి వస్తే బిసిల రక్షణ కోసం ఎస్సీ, ఎస్టీ చట్టం తరహాలో ప్రత్యేక చట్టం తీసుకొస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వం బిసిలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. దాడులు, అక్రమ కేసులు పెరిగాయన్నారు. కార్యక్రమంలో రంగప్ప, ఈశ్వరయ్య, మంజునాథ్, వీరనారప్ప, మహేష్, ఆంజనేయులు, సత్యం, తదితరులు పాల్గొన్నారు.